# ప్రైవేటు విద్యాసంస్థల ఇష్టారాజ్యం

- అడ్డగోలుగా ఫీజుల వసూలు
- పాఠశాలల్లోనే యూనిఫామ్‌లు, పుస్తకాల విక్రయాలు
- విద్యా హక్కు చట్టానికి తూట్లు
- లబోదిబోమంటున్న తల్లిదండ్రులు
- ఉదాసీన వైఖరిలో విద్యా శాఖాధికారులు

**జిల్లాలో ప్రైవేటు విద్యా సంస్థల దోపిడీకి అడ్డూ అదుపులేకుండా పోయింది. వ్యాపార దోరణితో యాజమాన్యాలు వ్యవహరిస్తుండడంతో సామాన్యుడికి ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారుతున్నది. ఎంతో కష్టపడి సంపాదించినదంతా పిల్లల చదువునకే ఖర్చు అవుతుండడంతో పేద, మధ్య తరగతి వారు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ప్రైవేటు కార్పొరేటు విద్యా సంస్థల్లోనే చదివించాలంటేనే జంకుతున్నారు. విద్యను వ్యాపారంగా మార్చిన ప్రైవేటు విద్యా సంస్థలు ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తున్నాయి. తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చదివించాలనే తల్లిదండ్రుల ఆకాంక్షను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. పాఠశాలల్లో ఫీజులకు తోడు యూనిఫామ్‌లు, పుక్తకాలు, నోటుబుక్కులు, బస్సు ఫీజులు అంటూ వసూలు చేస్తున్నారు. విద్యా సంస్థలు ప్రారంభం అవుతుందంటే చాలు తల్లిదండ్రులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. కొంత మంది వడ్డీలకు డబ్బులు తీసుకొచ్చి పిల్లలను చదివిస్తూ అప్పుల పాలవుతున్నారు.**

**- రంగారెడ్డి, మే 16 (నమస్తే తెలంగాణ)**



రంగారెడ్డి జిల్లాలో పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు

రంగారెడ్డి జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు విద్యను వ్యాపారంగా మలిచి యథేచ్ఛగా డొనేషన్లు, ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఫీజుల నియంత్రణ పాటించాలని, అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించినా పట్టించుకోవడం లేదు. మరోవైపు లక్షల రూపాయల డొనేషన్లు తీసుకుంటున్నాయి. విద్యహక్కు చట్టం ప్రకారం పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలను విక్రయించరాదని నిబంధనలు ఉన్నాయి. అనేక పాఠశాలలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్నారు. ప్యాకేజీ రూపంలో ఎల్‌కేజీ నుంచి యూకేజీ వరకు పాఠ్యపుస్తకాలకు రూ.5వేలు, ఆ పై తరగతులకు రూ.15 వేల చొప్పున వసూలు చేస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న దోపిడీని అరికట్టడం లేదని సర్వత్రా ఆరోపణలొస్తున్నాయి. శివారులోని శంకర్‌పల్లి, మొయినాబాద్, శంషాబాద్, రాజేంద్రనగర్, తుక్కుగూడ, ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం, తుర్కయంజాల్, పెద్దఅంబర్‌పేట, ఆమనగల్లు తదితర మున్సిపాలిటీల్లో విద్యా వ్యాపారం జోరుగా సాగుతున్నది. విస్తరిస్తున్న కాలనీలకు అనుగుణంగా కొత్త పాఠశాలలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. కొత్త పాఠశాలల్లో కార్పొరేట్ విద్యనందిస్తామని విద్యార్థులను ప్రలోభాలకు గురిచేస్తూ ఫీజులు, డొనేషన్లు, పుస్తకాలు, డ్రెస్సులు, ట్రాన్స్‌ఫోర్టుల పేరుతో ఒకొక్కరి నుంచి రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. ప్రైవేటు విద్యా వ్యాపారం యథేచ్ఛగా సాగుతున్నప్పటికీ అడ్డుకట్ట వేయడం లేదంటూ విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 1500లకు పైగా ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో టాలెంట్, టెక్నో, యూటెక్నో, డీజీ, ఒలంపియా, ఐఐటీ, జేఈఈ, మాడల్ స్కూల్స్, కంప్యూటర్, స్పోర్ట్స్, డిజిటల్ తదితర ఆకర్షణీయమైన కోర్సుల పేర్లు చెప్పి విద్యార్థుల తల్లిదండ్రులను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. యాజమాన్యాలు నిర్ణయించిన మేరకే ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

### పల్లెల నుంచి పట్టణ ప్రాంతాలకు..

జిల్లాలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన అనేక మంది తమ పిల్లలను చదివించేందుకు ఇబ్రహీంపట్నం, బొంగుళూరు, తుర్కయాంజాల్, రాగన్నగూడ, మన్నెగూడ, తుక్కుగూడ, చేవెళ్ల, పెద్దఅంబర్‌పేట, హయత్‌నగర్, ఎల్‌బీ నగర్, బీఎన్ రెడ్డి తదితర ప్రాంతాల్లో ఇండ్లను అద్దెకు తీసుకుని తమ పిల్లలను చదివిస్తున్నారు. ఇటీవల మన్నెగూడ, రాగన్నగూడ, బొంగుళూరు, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ప్రైవేటు పాఠశాలలు ఏర్పాటయ్యాయి. ఈ పాఠశాలల్లో చదివించాలనే ఆసక్తితో తల్లిదండ్రులు ముందుకొస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని ఆయా పాఠశాలల యాజమాన్యాలు డొనేషన్లు వసూళ్లతో పాటు ఫీజులు కూడా పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని పాఠశాలల్లో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు లక్షల రూపాయల్లో సంవత్సరానికి వసూలు చేస్తున్నారు. వీటికి తోడు ఇబ్రహీంపట్నం నుంచి మన్నెగూడ, రాగన్నగూడ, తుర్కయాంజాల్ బస్సు సౌకర్యం కోసం రూ.10 వేల నుంచి రూ.20 వేట వరకు వసూలు చేస్తున్నారు. విద్యావ్యాపారాన్ని అరికట్టడంలో విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

### అంతంత మాత్రంగానే వసతులు..

రంగారెడ్డి జిల్లాలోని అనేక ప్రైవేటు పాఠశాలల్లో సరైన వసతులు కల్పించడం లేదు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండడం లేదు. ఒక్కో తరగతి గదిలో 60 నుంచి 80 మంది వరకు విద్యార్థులను కూర్చోబెడుతున్నారు. సరైన ఆట స్థలాలు ఉండడంలేదు. అద్దె భవనాల్లో పాఠశాలలు నిర్వహిస్తున్నారు. తక్కువ వేతనాలకు అనుభవం లేని ఉపాధ్యాయులను నియమించి పాఠశాలలను కొనసాగిస్తున్నారు. అనేక ప్రైవేటు పాఠశాలలు అడ్మిషన్ల సమయంలో గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారాలు నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులను ప్రలోభాలకు గురిచేస్తూ అడ్మిషన్లు చేసుకుంటున్నారు. మరోవైపు అనుమతి లేకుండా కూడా ప్రైవేటు పాఠశాలలను కొనసాగిస్తున్నారు. పాఠశాలల్లో వసతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు తదితర వాటిపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.


### ఇంజినీరింగ్ కళాశాలలో ఊపందుకున్న సీట్ల విక్రయాలు..

జిల్లా పరిధిలో ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ల విక్రయాలు ఊపందుకున్నాయి. ఎంసెట్ కౌన్సెలింగ్ వెలువడిన వెంటనే సీట్ల అమ్మకాలు జరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు వందకు పైగా ఇంజినీరింగ్ కళాశాలలున్నాయి. వీటిలో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల విక్రయాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. సీఎస్సీ, ఈసీ తదితర సీట్లకు రూ.10 లక్షల వరకు వసూలు చేస్తుస్తున్నాయి. ఐటీ, ఈఈఈ తదితర సీట్లకు పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నాయి. పేరున్న కళాశాలల్లో విద్యార్థులు సీట్ల కోసం పోటీ పడుతుండటంతో మేనేజ్‌మెంట్లు కూడా అందుకనుగుణంగానే డబ్బులు వసూలు చేస్తున్నాయి.

### అధికారులు విఫలం..

ఏటా పెరుగుతున్న ఫీజులను నియంత్రించడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కేజీ నుంచి పీజీ వరకు అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఫీజుల నియంత్రణపై ప్రభుత్వ పరంగా తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### ప్రైవేటులో ఫీజులను నియంత్రించాలి



ప్రైవేటు పాఠశాలల్లో పెద్ద ఎత్తున ఫీజులు, డొనేషన్లు వసూలు చేస్తుండడంతో సామాన్యులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకరిని చూసి ఒకరు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. తమ పిల్లల కోసం అప్పులు చేసి ప్రైవేటు పాఠశాలలకు అడిగినంత ఫీజులను చెల్లిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలి. డొనేషన్లు తగ్గించేలా చర్యలు తీసుకోవాలి.

**- నిట్టు జగదీశ్వర్, విద్యార్థి నాయకుడు**

### ఫీజుల మోతపై చర్యలేవి?



ఏటా ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల మోత మోగుతున్నది. కళాశాలల్లో ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. వీటిని నియత్రించాల్సిన ఉన్నతస్థాయి అధికారులు, ప్రభుత్వం మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఫీజుల మోత మోగిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి.

**- మొగిలి వెంకటేశ్, ఇబ్రహీంపట్నం**

ప్రైవేటు పాఠశాలల్లో డిటిటల్ క్లాస్‌లు, ఆటల పోటీలు, డ్యాన్స్‌లు, తరగతి గదుల్లో కంప్యూటర్ విద్య, సైన్స్ ల్యాబ్, లైబ్రరీలు, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ అంటూ ప్రచారాలు నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకుంటున్నారు. ఆ తర్వాత విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అందినకాడికి దండుకుంటున్నారు. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు ఇలా ఉన్నాయి.

**ఫీజుల మోత..**

| | |
|---|---|
| ఎల్‌కేజీ నుంచి 5వతరగతి వరకు | రూ.50వేల నుంచి రూ.లక్ష |
| రవాణా చార్జీల పేరుతో | రూ.15వేల నుంచి రూ.20వేలు |
| పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్‌కు | రూ.10వేల నుంచి రూ.20వేలు |
| డ్రస్, టై, బెల్టులకు | రూ.5వేల నుంచి రూ.8వేలు |
| 5వ తరగతి నుంచి 10తరగతి వరకు | రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు |
| డొనేషన్ల పేరుతో | రూ.లక్షల్లో వసూలు |



బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావును... మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ శుక్రవారం హైదరాబాద్‌లోని హరీశ్‌రావు నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

**- కడ్తాల్, మే 16**

## షెడ్యూల్ ప్రకారం సప్లిమెంటరీ పరీక్షలు

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- ఇంటర్ బోర్డు అధికారులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, మే 16 : తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిబంధనల ప్రకారం నిర్వహించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇంటర్ బోర్డు అధికారుల పరీక్షల అధ్యక్షతన ఆయా శాఖల అధికారులతో జిల్లా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు రెండు సెషన్లలో నిర్వహిస్తున్నందున, అందుకు అనుగుణంగా ఆర్టీసీ రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో వైద్య శాఖ ద్వారా మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. పోస్టల్ శాఖ పార్సెల్స్ కోసం తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలన్నారు. పరీక్షలకు అవసరమైన ఇన్విజిలేటర్లను జిల్లా విద్యాధికారి కేటాయిస్తారన్నారు. ఈ నెల 22 నుంచి 28 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని 10 పోలీస్ స్టేషన్ల పరిధి లో 20 పరీక్షా కేంద్రాల్లో మొదటి సంవత్సరం జనరల్‌లో 5,217 మంది, ఒకేషనల్‌లో 457 మంది ద్వితీయ సంవత్సరం జనరల్‌లో 2071 మంది, ఒకేషనల్‌లో 314 మంది విద్యార్థులు హాజరువుతున్నారని తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా మెడికల్ ఆఫీసర్ వెంకట రమణ, ఆర్టీసీ డిపో మేనేజర్ అరుణ, వివిధ శాఖల అధికారులు, జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్ నాయక్, జిల్లా పరీక్షల సమన్వయ కమిటీ సభ్యులు నర్సింహా రెడ్డి, సత్తయ్య, ప్రిన్సిపాల్ సురేశ్వర స్వామి, టాన్స్‌కో ఎస్‌ఈ రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### 25 వేల ఎంటీల వరి ధాన్యం సేకరణ

**వికారాబాద్ :** జిల్లాలో ఇప్పటివరకు 25 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించినట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్‌లతో కలిసి పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి వరి ధాన్యం కొనుగోళ్లు, కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వీసీలో వరి ధాన్యం సేకరణపై మంత్రి ఆరా తీయగా.. జిల్లాలో 128 కొనుగోలు కేంద్రాల్లో వరి కొనుగోలు ప్రక్రియను మొదలు పెట్టామని, ఇప్పటికీ 25 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించినట్లు కలెక్టర్ వివరించారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయాలతో పాటు కావాల్సిన తాడిపత్రిలు, సంచులు, తేమ యంత్రాలను ఏర్పాటు చేశామని మంత్రికి తెలిపారు. కలెక్టరేట్ నుంచి వీసీలో కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, డీఆర్‌డీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్ఎస్‌వో వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్

ఆమనగల్లు, మే 16 : రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని టీఎస్ఎస్‌వో వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్ డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు రూ.8వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉందన్నారు. ఈ బకాయిలతో సంక్షోభంలో చిక్కుకున్న ప్రైవేటు కళాశాలలు ఆధ్యాపకులకు వేతనాలు చెల్లించలేని దుస్థితి నెలకొందన్నారు. కొన్ని వందల కళాశాలలు మూతపడ్డాయన్నారు. విద్యార్థులు చదువులు పూర్తయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో వారి చదువులకు ఆటంకం కలుగుతుందని తెలిపారు. కొన్ని సందర్భాల్లో విద్యార్థులు, కళాశాల యజమాన్యాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో తగాదాలు జరిగి పోలీస్ స్టేషన్ వరకు వెళ్లిన ఘటనలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. ఇలా జరిగిన రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయమై దృష్టి సారించకపోవడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మీసాల వంశీ, రాష్ట్ర కో ఆర్డినేటర్ సుదర్శన్, సోషల్ మీడియా ఇన్‌చార్జి మీసాల బాలవర్షిత్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## తృటిలో తప్పిన ప్రమాదం



తిమ్మాపూర్ స్టేషన్ వద్ద గూడ్స్ రైలు వెళ్తుండగా పట్టాల మధ్యలో పడుకున్న కార్మికుడు

కొత్తూరు, మే 16: బతుకాలనే కోరిక.. ఆపద సమయంలో సమయస్ఫూర్తి.. ప్రాణంమీదకు వస్తున్నా భయకుండా ఆ కార్మికుడు చాకచక్యంగా వ్యహరించంతో తృటిలో మృత్యు ఒడి నుంచి పయటపడ్డారు. ఈ తతంగాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో.. కార్మికుడి సయస్ఫూర్తిని నెటిజన్లు కొనియాడుతున్నారు. అది కొత్తూరు మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ రైల్వే జంక్షన్. పెద్ద జంక్షన్ కావడంతో ప్యాసింజర్ రైళ్లతోపాడు గూడ్సు రైళ్లు ఎక్కువగానే వస్తుంటాయి. శుక్రవారం సాయంత్రం బిహార్‌కు చెందిన కార్మికుడు రైల్వే ట్రాక్ దాటుతున్నాడు. ఈ సమయంలో గూడ్స్ రైలు అకస్మాత్తుగా కదిలింది. దీంతో ఆ కార్మికుడికి ఏం చేయాలో అర్థం కాలేదు. ఈ సమయంలో చాకచక్యంగా వ్యవహరించి రైల్వే ట్రాక్ మధ్యలో పడుకున్నాడు. రైలు వెళ్లిన తర్వాత తాపీగా లేచి నడుచుకుంటూ వెళ్లిపోయాడు. ఈ దృశ్యాన్ని గుర్తు తెలియన వ్యక్తి వీడియో తీసి సోషన్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఆ కార్మికుడి సమయస్ఫూర్తిని నెటిజన్లు అభినందిస్తున్నారు.

## ఉద్యోగులకు డీఏలను వెంటనే ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రెడ్డి

పరిగి, మే 16 : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన 5 డీఏలను వెంటనే ప్రకటించాలని టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రఘునందన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పీఆర్‌సీ కమిటీ వేసి రెండేండ్ల కాల పరిమితి పూర్తి కావస్తున్నందున నివేదిక తెప్పించి 51శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలన్నారు. శుక్రవారం పరిగిలో టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, దేశంలోని 28 రాష్ట్రాల ఉద్యోగులకు ఒక్క డీఏ పెండింగ్‌లో లేవని, కేవలం తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయులకే 30 నెలల 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ గోపాల్, జిల్లా అధ్యక్షుడు పి.సత్యనారాయణ రెడ్డి, గౌరవాధ్యక్షుడు బస్వరాజు, రాష్ట్ర, జిల్లా నాయకులు జాంప్లా, రూప్‌సింగ్, బాలకృష్ణ, ప్రవీణ్, నరేందర్, వెంకటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డెంగీని అరికట్టడం అందరి బాధ్యత



వికారాబాద్ : ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

వికారాబాద్, మే 16 : డెంగీని అరికట్టడం మనందరి బాధ్యత అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కీటక జనిత వ్యాధుల జిల్లా నియంత్రణ అధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్‌తో కలిసి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి దగ్గర జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ ప్రభుత్వ దవాఖాన నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెంగ్యూ అవగాహన ర్యాలీలు నిర్వహించినట్లు తెలిపారు. అవగాహన ర్యాలీలో డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ సృజన, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, ప్రోగ్రాం అధికారి మహేశ్‌కుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రకాశ్, సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాలొన్నారు.

### పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీ నివారణ

**షాద్‌నగర్‌టౌన్ :** పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీ వ్యాధిని నివారించవచ్చని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ దవాఖాన ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డెంగీ వ్యాధి బారిన పడకుండా నివాసాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇండ్ల వద్ద నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈడీఎస్ దోమలు పగటిపూట కుడితే డెంగ్యూ వ్యాధి వస్తుందన్నారు. తీవ్రమైన జ్వరం రావడం, తలనొప్పి, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించడం, శరీరం మీద దద్దుర్లు, వికారం వాంతులు కావడం తదితర డెంగీ లక్షణాలని తెలిపారు. ఈ లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యాధికారులు డాక్టర్లు కార్తీక్, జగదీశ్, సంధ్య, బిందు, ఉష, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్లు అమృత, శ్రీరామ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌టౌన్ : అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

## పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రేణుకాదేవి

బంట్వారం, మే 16 : ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచాలని డీఈవో రేణుకాదేవి పేర్కొన్నారు. శుక్రవారం కోట్‌పల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో తల్లిదండ్రులతో బడిబాటపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలో చదివిస్తే తల్లిదండ్రుల జేబులు ఖాళీ అవుతాయని, ప్రభుత్వ పాఠశాలలో ఎలాంటి ఫీజులు లేకుండా, అన్ని రకాల పుస్తకాలు, నోటు పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం, అల్పాహారం సైతం అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రావీణ్యం ఉన్న ఉపాధ్యాయుల బోధన ఉంటుందని, డిజిటల్ తరగతులు సైతం నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలలను మరింత అభివృద్ధి పథంలో నడిపించాల్సి ఉందన్నారు. ఇందుకు గ్రామాల్లోని మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు చొరవ తీసుకుని పిల్లలందరూ బడిలో ఉండేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో చంద్రప్ప, కేజీబీవీ ప్రిన్సిపాల్ పల్లవి, మహిళా సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అటకెక్కిన రూ.500ల సబ్సిడీ సిలిండర్.!



అడవి నుంచి కట్టెలను మోసుకెళ్తున్న మహిళలు

కేశంపేట, మే 16: దేశంలోని ఏ ఒక్క ఆడ బిడ్డ కట్టెల పొయ్యిమీద వంట చేయకుండా చూస్తాం. ప్రతి మహిళకు ఉచితంగా సిలిండర్‌ను అందజేస్తామని దేశ ప్రధాని నరేంద్రమోదీ అంటుంటే తామేమీ తక్కువ కాదన్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం రూ.500కే వంట గ్యాస్ సిలిండర్‌ను అందజేస్తామని ఎన్నికల్లో ప్రకటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హామీలు ప్రకటనలు, పత్రికల్లో వార్తల వరకే తప్పా క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదని మరోమారు తేలిపోయింది. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం లేమామిడి గ్రామ పంచాయతీ పరిధిలోని గాంధీ శంకర్‌పల్లికి చెందిన గిరిజన మహిళలు గ్యాస్ సిలిండర్ లేకపోవడంతో కట్టెల పొయ్యిమీదనే వంట చేస్తున్నట్లు తెలిపారు. వంట చేసుకునేందుకు కట్టెలకోసం కంచె(అడవి)కి వెళ్లి కట్టెలు కొట్టి ఇంటికి తీసుకురావడం కనిపించింది. ఈ విషయమై మహిళలను పలకరించగా ప్రభుత్వాలు ఎన్ని మారినా తమ తల రాత మారలేదని, సిలిండర్ రాకపోవడంతో కట్టెల పొయ్యిమీదనే వంట చేస్తున్నట్లు తెలిపారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద రూ.500 సబ్సిడీ సిలిండర్‌ను అందజేస్తామని చెప్పిన హామీ అధికారంలోకి వచ్చి 17నెలలు కావస్తున్నా నేటికీ ఆచరణకు నోచుకోలేదని, రూ.500కు సిలిండర్ వస్తుందన్న ఆశలేదని మహిళలు వాపోతున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి నిరుపేదలకు సిలిండర్లను అందజేయాల్సిన అవసరముంది.

## యూనిఫామ్‌లు వేగవంతంగా కుట్టాలి



కొత్తపేటలోని మహిళా శక్తి కుట్టు కేంద్రంలో కుట్టిన యూనిఫాంలను డీపీఎంకు చూయిస్తున్న మహిళా సమాఖ్య సిబ్బంది

కేశంపేట, మే 16 : విద్యార్థుల యూనిఫామ్‌ల కుట్టడం వేగవంతంగా పూర్తి చేయాలని డీఆర్‌డీఏ డీపీఎం (డిస్టిక్ ప్రాజెక్టు మేనేజర్) నర్సింహులు సూచించారు. కేశంపేట మండల పరిధిలోని కొత్తపేటలో ఉన్న మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల యూనిఫాంలు కుట్టడం ఎంత వరకు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. స్పందించిన ఏపీఎం భగవంతు కేశంపేట, కొత్తపేట, పాపిరెడ్డిగూడ గ్రామాల్లో మహిళా శక్తి కేంద్రాలు ఉన్నాయని, 29 పంచాయతీలకు సంబంధించి 41పాఠశాలలు 1204 బాలురు, 1463 మంది బాలికలు మొత్తం 2,667 మంది విద్యార్థుల యూనిఫాంలను కుడుతున్నారని తెలిపారు. ఇప్పటి వరకు 86.50 శాతం యూనిఫామ్‌లను కుట్టినట్లు తెలిపారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు 100 శాతం యూనిఫామ్‌లను కుడుతారన్నారు. కార్యక్రమంలో ఏపీఎం భగవంతు, సీసీ మల్లేశ్, కొత్తపేట గ్రామ మహిళా అధ్యక్షురాలు లలిత, టైలర్లు నజ్మాబేగం, సంపూర్ణ, మంజుల, వీవోఏ నర్సమ్మ పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి




సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్

కొడంగల్, మే 16 : దళారులను నమ్మి నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని డీఎస్పీ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నకిలీ విత్తనాల పట్టివేతపై విలేకరులతో మాట్లాడుతూ.. అధిక దిగుబడులు సాధిం టచుకోవచ్చని రైతులను నమ్మించి కొందరు అక్రమ వ్యాపారులు నకిలీ విత్తనాలను అంటగడుతున్నట్లు పేర్కొన్నారు. రైతులు విత్తనాలు, ఎరువులు, మందులు కొనుగోలు చేసే క్రమంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేసి, కొనుగోలుకు సంబంధించిన రసీదులు భద్రపరచుకోవాలని సూచించారు. మండల పరిధిలోని అంగడిరైచూర్‌లో సమాచారం మేరకు వ్యవసాయాధికారితో పాటు ఎస్సై సత్యనారాయణ గ్రామంలో తనిఖీలు నిర్వహించగా వెంకటప్ప ఇంట్లో 20క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు లభించాయని, వీటి విలువ దాదాపుగా రూ.40లక్షల వరకు ఉంటుందని తెలిపారు. విత్తనాలను ముదేల్‌కు చెందిన పెద్ద మల్లప్ప, కొత్తపల్లికి చెందిన కొండప్ప నాయుడు ఇద్దరు కలిసి వెంకటప్ప ఇంట్లో విత్తనాలను నిల్వ చేసి అమ్మకాలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. వీటిపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసి విత్తనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే ఈ నెల 14న పట్టణంలోని అంబేద్కర్ కూడలి ప్రాంతంలో వాహనాల తనఖీలో భాగంగా కల్తీ ఆహార పదార్థాలను రవాణా చేసే వాహనాన్ని గుర్తించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని కాటేదాన్ నుంచి కర్ణాటకలోని షాబాద్‌కు నకిలీ అల్లం పేస్టుతో పాటు వంట నూనెను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వస్తువులను తనిఖీ నిర్వహించగా కాటేదాన్ నుంచి రవాణా చేస్తూ వస్తువులపై ఉన్న లేబుల్ మాత్రం షాబాద్‌లో తయారీ అవుతున్నట్లు ఉందన్నారు. ఇతర వస్తువుల తయారీకి సంబంధించిన లేబుల్స్‌ను గుర్తించినట్లు తెలిపారు. వీటిపై విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అహ్మద్, షాబాజ్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో సీఐ శ్రీధర్‌రెడ్డి, వ్యవసాయాధికారులు రాజు, ఐజాక్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.